క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు మారెళ్ల విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముండ్లమూరు (దర్శి): అండర్‌–14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మారెళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ఏ సంతోష్ ఎంపికయ్యారు. మంగళవారం ఒంగోలులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, పీఈటీ పి. సుజాతలు విద్యార్థిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో రాణించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు


శ్రీకాళహస్తీశ్వరస్వామి మూలవిరాట్

కురిచేడు: మాస శివరాత్రి సందర్భంగా స్థానిక శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు, విశ్వనాథశాస్త్రిలు స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజల్లో పాల్గొన్నారు. గురువారం నుంచి దేవి శరన్నవరాత్రులు ప్రారంభం కానుండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనటం, ప్రత్యేక పూజలు నిర్వహించటం విశేషాన్ని సంతరించుకుంది.

బండి వెలిగండ్ల ఎస్సీ కాలనీ చీకటిమయం

- వీధి లైట్లు వేయాలని అధికారులకు విజ్ఞప్తి


చీకటి మయమైన బండి వెలిగండ్ల ఎస్సీ కాలనీ

దర్శి: మండలంలోని బండి వెలిగండ్ల ఎస్సీ కాలనీపై టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాలకులు చిన్నచూపు చూస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. సర్పంచ్‌ను కనీసం వీధిలైట్లయినా వేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. వీధి లైట్లు లేక గ్రామంలోని వీధుల్లో రాత్రి పూట తిరగాలంటే బిక్కుబిక్కుమంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో రాత్రిపూట అడవి పందులు తిరుగుతున్నాయని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. అవి ఏ సమయంలో దాడి చేస్తాయోనని, దీపాలు పెట్టుకుని కాపాలాలు ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాల్లో చెప్పినా తమ గోడు వారికి పట్టడం లేదని వాపోతున్నారు. గ్రామ ప్రజాప్రతినిధులుగానీ అధికారులకుగానీ ఎన్ని మార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కనీసం వీధి లైట్లు కూడా వేయక పోతే రాత్రి సమయాల్లో పురుగులు కుడితే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వీధుల్లో వీధి లైట్లు వేసి తమ తమ కాలనీలో వెలుగులు నింపాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.

జోన్ కాలువ కుదింపు ఎందుకు?


చివర పొలాల వద్ద పూడిపోయిన కాలువ


రోడ్డు వైపు సైజు తగ్గించి నిర్మిస్తున్న కాలువ

- టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన వెంచర్‌కు దారి కోసమేనా
- పది అడుగుల కాలువను మూడు అడుగులకు కుదించి నిర్మాణం
- పైరైతులకు నీరందేదెలా?

దర్శి: నియోజకవర్గంలో కొందరు అధికారులు టీడీపీ నాయకులతో కలిసి వారికి ఆదాయం తెచ్చి పెట్టడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. తూర్పు చౌటపాలెం ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డులో హ్యాపీ హోమ్స్ వెనుక వైపు టీడీపీ నాయకులు 15 ఎకరాల్లో భారీ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ వెంచర్ తూర్పు చౌటపాలెం ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉంది. పెద్ద రోడ్డు అయినా ఆ రోడ్డు క్రిస్టియన్ పాలెం మీదుగా వెళ్తోంది. ఎస్సీలు ఉన్న చోట నుంచి రోడ్డు ఉంటే అటు నుంచి వెళ్లాలంటే వెంచర్‌లో ప్లాట్లకు రేటు రాదనుకున్నారేమోకానీ అందుకు మరో పథకం వేశారు. ఆ వెంచర్ సమీపంలో హ్యాపీ హోమ్స్ పక్క నుంచి సాగర్ జోన్ కాలువ (పిల్ల కాలువ) వెళ్తోంది. హ్యాపీ హోమ్స్ అనే భారీ వెంచర్ పక్క నుంచి కాలువ తూర్పు చౌటపాలెం రోడ్డులోకి వెళ్లి కలుస్తుంది. ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉన్నా ఆ రోడ్డులో కలిసే ఈ కాలువ కట్టపై కాలువ లోపలి వైపు 10 అడుగులు వెడల్పు ఉన్న కాలువను 3 అడుగులకు తగ్గించి సీసీ కాలువలు పోస్తున్నారు. కాలువ పక్క నుంచి మరో పెద్ద రోడ్డు వేస్తున్నారు. కాలువ లోపలి వెడల్పు 10 అడుగుల ఉంది. కాలువ పక్కన మార్జిన్ 20 అడుగులకుపైగా ఉంది. ఏకంగా కాలువనే పూడ్చి మూడు అడుగులకు జోన్ కాలువ కుదించి కాంక్రీట్‌తో నిర్మాణాలు చేస్తున్నారు. దీంతో రైతులకు నీరు పూర్తి స్థాయిలో వెళ్లే అవకాశం లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ జోన్ కాలువ సాగర్ ప్రధాన కాలువ నుంచి మొదలై పుట్టబజారు రోడ్డు, లంకోజనపల్లి రోడ్డు, పొదిలి రోడ్డు, క్రిస్టియన్ పాలెం వద్ద భాష్యం స్కూల్ దగ్గర నుంచి తూర్పు చౌటపాలెం రోడ్డులో పొలాలలకు నీరు వెళ్తోంది. కాలువను వెడల్పు తగ్గించి కుదించడం ద్వారా రైతులకు నీరు అందే మార్గం లేకుండా పోతోంది. కాలువ చివరి పొలాలు వరి పంటలు వేసి జీవనాధారం చేస్తున్నారు. గతంలో ఇక్కడ మొత్తం వరి పొలాలు ఉండేవి. పట్టణం అభివృద్ధి చెందుతూ క్రమేపీ పెరుగుతూ అన్నీ వెంచర్లుగా మారాయి. కాలువ బారుకి భారీగా నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. అయినా గతంలో జోన్ కాలువ వెడల్పు తగ్గకుండా నిర్మాణాలు చేశారు. కాలువ చివర్లో మాత్రం సీసీ నిర్మాణాలు లేకపోవడంతో దాన్ని పూడ్చి వేసి రోడ్డు వేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అసలు కాలువ ఎన్‌ఎస్‌పీ అధికారులు పోస్తున్నారా లేక టీడీపీ నాయకులు తమ వెంచర్‌కు పెద్ద రోడ్డు వస్తే రేటు మరింత పెరుగుతుందని పోస్తున్నారో అర్థంకాని విషయమైంది. ఈ విషయంపై చీమకుర్తి ఎన్‌ఎస్‌పీ డీఈని గిరిబాబును వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. సంబంధిత అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు లేకుండా కాలువ వెడల్పు పెంచి నిర్మాణాలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


కాలువ నిర్మాణం


తూర్పు చౌటపాలెం రోడ్డులో ఏర్పాటు చేస్తున్న వెంచర్

అధికారులు రాజకీయం చేస్తున్నారు

- దొనకొండ ఎంపీపీ ఉషామురళి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉషామురళి

దొనకొండ (కురిచేడు): అధికారులు తమ బాధ్యతలు మరిచి రాజకీయాలు చేస్తున్నారని ఎంపీపీ ఉషామురళి మండిపడ్డారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వం నుంచి ఏ పథకాలు వస్తున్నాయో వాటిని అమలు చేయటంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కారం దిశగా పనులు చేయాలన్నారు. అలా కాకుండా కొందరు అధికారులు తమ బాధ్యతలు వీడి రాజకీయాలకు పరిమితమయ్యారని, ఎవరెవరు ఏమేమి చేస్తున్నారో తెలుసనని, సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించాలని, మొక్కుబడిగా పనులు చేయవద్దని పేర్కొన్నారు. సంగాపురం సర్పంచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారులు సర్పంచులను మభ్యపెట్టి పనిచేసే వరకు ఒక విధంగా, పని పూర్తయ్యాక మరొక విధంగా బిల్లులు చేస్తూ సర్పంచులను నష్టపరుస్తున్నారని ఏపీఓ దేవయ్యనుద్దేశించి మాట్లాడారు. డంపింగ్ యార్డులకు రూ.40 వేలు ఇస్తామన్నారని, నిర్మాణం పూర్తయ్యాక ఐదు వేల రూపాయలతో సర్దుకోమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారు ఇచ్చే ఐదువేల రూపాయలు వాటికి వేసిన రంగులకు సరిపోవని, అధికారులు ముందు చెబుతోంది ఒకటి, తర్వాత చేస్తోంది మరొకటని ఆందోళన వ్యక్తం చేశారు. దొనకొండ సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో విద్యుత్ స్తంభాలు కొన్ని చోట్ల కూలిపోయే స్థితిలో ఉన్నాయని, వాటిని మార్చాలని విద్యుత్ ఏఈ నాగూర్‌ను కోరారు. ఆయన స్పందిస్తూ కొన్నింటినైనా మార్చుతానని హామీ ఇచ్చారు. ఎంఈఓ సాంబశివరావు మాట్లాడుతూ దొనకొండ జిల్లా పరిషత్ హైస్కూల్ పరిధిలో ఐదు సంవత్సరాల క్రితం నిర్మించిన బాలికల వసతి గృహాన్ని కేజీబీవీ–2గా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోందన్నారు. అక్టోబర్ 31 లోపు మరమ్మతులు చేసి ఉన్నతాధికారులు తేదీని ఖరారు చేయగానే ప్రారంభిస్తారని, ఇది బాలికలకు వరంగా ఉంటుందన్నారు. ముందుగా 100 మంది విద్యార్థినులతో ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.శ్రీదేవి, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో గాంధీ జయంతి వేడుకలు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు మహాత్మా గాంధీ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సావిత్రి మాట్లాడుతూ సాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన ఉద్యమాలు మరువలేనివని కొనియాడారు. గాంధీజీతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ప్రాణాలు అర్పించిన పలువురు మహా నాయకుల త్యాగాల గురించి తెలిపారు. విజయబాబు, అక్రం, జయసింహ, రమేష్‌తో పాటు అతిథి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభలు నిర్వహించాలి

పుల్లలచెరువు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో వసంతరావు నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీ పథకం కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలో ప్రజలకు ఉపయోగపడే పనులు గుర్తించాలన్నారు. దీన్ని లేబర్ బడ్జెట్‌గా గుర్తించాలన్నారు. తప్పని సరిగా అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు.

సాంకేతికతను చేరువ చేయడమే పొలం బడి లక్ష్యం


పెద్దారవీడు: రైతులతో మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి


తాళ్లూరు: పొలం బడి గురించి వివరిస్తున్న అధికారులు

తాళ్లూరు (దర్శి): ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పంటల పెరుగుదల, దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నందున రైతులకు వ్యసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేసేందుకు పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఓ ప్రసాద్‌రావు సూచించారు. దోసకాయలపాడు, లక్కవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ కంది పంటలో నల్లి నివారణకు ముందస్తు చర్యగా వేపనూనె 15 రోజులకు ఒకసారి పిచికారీ చేస్తే పురుగు వాలదని, ఒక వేళ వాలినా గుడ్డు పెట్టకుండా ఉంటుందని చెప్పారు. గుడ్డు పెట్టినా అది పిగలకుండా నివారించవచ్చన్నారు. పశు వైద్యాధికారి రాంబాబు మాట్లాడుతూ ఏదైనా వ్యాధి బారిన పడకుండా పశువులకు ముందస్తు టీకాలు వేస్తున్నామన్నారు. గర్భం దాల్చినవి, ఈనటానికి దగ్గరగా ఉన్నవి తప్ప మిగిలిన పశువులకు టీకాలు వేయించుకోవాలన్నారు. సర్పంచ్ కె.శివలక్ష్మి, వీఏఏలు భార్గవి, వీరాంజనేయులు, వెటర్నారీ సిస్టెంట్‌లు మనీషా, అంకయ్య, మైక్రోఇరిగేషన్ అధికారి అమృత, సర్వేయర్ ప్రసన్నబాబు, రైతు సత్యం పాల్గొన్నారు.

పెద్దారవీడు: పంటలపై విచక్షణారహితంగా వాడుతున్న ఎరువులతో ప్రాణకోటికి ప్రమాదం పొంచి ఉందని మండల వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి పేర్కొన్నారు. మండలంలోని సానికవరం, మద్దలకట్ట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి రైతులు సేంద్రియ ఎరువుల వినియోగం వైపు మొగ్గ చూపాలని సూచించారు. యాజమాన్య, జీవ నియంత్రణ, రసాయన పద్ధతులను సమతుల్యంతో ఆచరించాలన్నారు. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులను రైతులు అవగాహన లేక ఇతర పురుగులతో పాటు వాటిని చంపేస్తున్నారని, చీడపీడల ఉనికిపై నిఘా ఉండాలన్నారు. పంటలపై విచక్షణ రహితంగా పురుగుమందులు పిచికారీ చేయకూడదన్నారు. పురుగుల ఉధృతి పరిమిత దాటినప్పుడు మిత్ర పురుగులకు హాని కలగని క్రిమి సంహారక మందులు మాత్రమే వినియోగించాలన్నారు. వీఏఏలు శ్రీకాంత్, శిరీషా, రైతులు పాల్గొన్నారు.

దర్శి: ప్రతి రైతు పంటల్లో యాజమాన్య పద్ధతులపై అవగాహన ఉండాలని వ్యవసాయాధికారి బాలకృష్ణ నాయక్ సూచించారు. మండలంలోని శామంతపూడి, తూర్పు చౌటపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ ఖరీఫ్ సంబంధించిన వరి విత్తనాలు ఏపీ సీడ్స్ ద్వారా అందించేందుకు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. పంట విస్తరణ కార్యక్రమంలో భాగంగా పండ్ల తోటలకు 40 శాతం రాయితీ, నీటి కుంటలు, మినీ ట్రాక్టర్‌లు, తైవాన్ స్ప్రేయర్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయ సహాయకులు డి.అరుణ,ఎం.రమ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలు

పుల్లలచెరువు: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముటుకుల పరిధిలో మంగళవారం వ్యవసాయ అధికారులు ఆ కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పత్తి పంటలో కాయతొలుచు పురుగును గమనించినట్లు వ్యవసాయాధికారి నిర్మలాదేవి తెలిపారు. ఈ సమయంలో గులాబీ రంగు పురుగు వచ్చే అవకాశం ఉందని, సస్యరక్షణ చర్యలు పాటిస్తే పురుగును నివారించవచ్చన్నారు. ఎక్కువ పురుగుమందులు, ఎరువులు వాడకుండా అధికారులు సూచించిన మోతాదులో వాడాలన్నారు. వీఏఏ కొండానాయక్, వీహెచ్‌ఏ వెంకటేశ్వరనాయక్, రైతులు పాల్గొన్నారు.

పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

కురిచేడు: రైతులు పంటల్లో ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి పి. మధుబాబు కోరారు. మండలంలోని నమశ్శియాపురం, పెద్దవరం గ్రామాల్లోని పలు పంటలను క్షేత్రస్థాయిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం పరిశీలించారు. తెగుళ్లు, పురగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన మందుల గురించి ఆయన వివరించారు. పంట నమోదు ప్రక్రియ ముగిసిందని, పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ఆయన సూచించారు. అలా చేయని వారికి ప్రభుత్వ లబ్ధి చేకూరదని ఆయన తెలిపారు. ఈకేవైసీకి బుధవారం ఒక్కరోజు మాత్రమే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బిందు సేద్యం, తుంపర సేద్యానికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీల గురించి ఏపీఎంఐపీ అధికారి కె.వెంకటేశ్వర్లు వివరించారు. ఉద్యాన శాఖ ద్వారా అమలు అవుతున్న పథకాల గురించి హెచ్‌ఈఓ బి.ధనలక్ష్మి వివరించారు. వీఏఏలు ఆర్.సౌమ్య లత, కె. అనూరాధ, రైతులు పాల్గొన్నారు.

దొనకొండ (కురిచేడు): రైతులు ఎండు తెగులు పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ కోరారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పి.వెంకటాపురం, ఇండ్లచెరువు గ్రామాల్లో రైతులతో కలిసి పత్తి, కంది, మిరప, పొగాకు పంటలను పరిశీలించారు. పత్తిలో ఎండు తెగులును గమనించి నివారణ కోసం కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును లీటర్ నీటికి 5 గ్రాములు లేదా రెడోమిల్ మందు 3 గ్రాములు కలిపి మొక్కల మొదల్లు బాగా తడిసేటట్లు పోసుకుంటే మంచి ఫలితం ఉంటుందని, తెగులు సోకిన మొక్కకి నాలుగు వైపులా ఉన్న మొక్కలకి కూడా పోస్తే పక్క మొక్కలకి వ్యాప్తి చెందదని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు వి.విన్నిబాబు, ఇరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న ఏఓ నిర్మలాదేవి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ బాలకృష్ణ నాయక్


దొనకొండ: పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మీనారాయణ


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ మధుబాబు

ఆటో డ్రైవర్‌లకు కౌన్సిలింగ్


ఆటో డ్రైవర్‌లను హెచ్చరిస్తున్న సీఐ, ఎస్సైలు

దర్శి: ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఆటో డ్రైవర్‌లకు దర్శి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.రామారావు, ఎస్సై ఎం.మురళీలు మంగళవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల ఆటో డ్రైవర్‌లు ఇష్టానుసారంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఆటోలు నడుపుతున్నారన్నారు. డ్రైవర్ పక్కన ప్రయాణికులను ఎక్కించుకోవడం, ఆటో వెనుక భాగంలో ఎక్కించుకోవడం చేస్తున్నారని చెప్పారు. దీంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇకపై అలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని కోరారు.

స్వర్ణాంధ్రప్రదేశ్‌-2047కు సూచనలు ఇవ్వాలి


విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న అధ్యాపకులు

దర్శి: స్వర్ణాంధ్ర ప్రదేశ్–2047లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభుదాస్ ఈ కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు సలహాలు, సూచనలు ప్రభుత్వానికి ఇవ్వాలని కోరారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని, మీ జీవితం ఉన్నతంగా ఉండాలంటే రాబోయే తరాలు వారికి ఎటువంటి పథకాలు విద్యా ప్రణాళికలు ఉండాలో వివరించారు. డాక్టర్ జి.హనుమంత రావు, గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఏ.నగేష్, ఇంగ్లిష్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌సీ రెడ్డి, రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ గంథం వేణు, తెలుగు అధ్యాపకులు బీవీ రమణరావు, చరిత్ర అధ్యాపకులు సౌరాలమ్మ, వైవీ రమణారావు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను చెట్లుగా పెంచాలి


మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయుడు వేణు

దర్శి: ప్రతి విద్యార్థి నాటిన మొక్కలను చెట్లుగా పెద్ద చేసి పెంచాలని కట్టశింగన్నపాలెం ఉపాధ్యాయులు గొర్రెపాటి వేణు సూచించారు. స్థానిక ఆ పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్లాంట్ ఏ ట్రీ ప్లాంట్ ఏ హోప్ అనే చిన్న చిన్న ఇనుప రేకులతో చేసిన బోర్డులను చెట్లకు అమర్చారు. విద్యార్థులతో ప్రత్యేక పేయింటింగ్‌లు వేయించి ఒక చెట్టు నాటు భవిష్యత్తు భరోసా ఇవ్వు.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయుడు పి.సుధాకర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సయ్యద్ సుభానీ, సీహెచ్ హైమావతి, విద్యార్థులు పాల్గొన్నారు.